క్లుప్తంగా

గడ్డివాములు దగ్ధం



దగ్ధమైన గడ్డివాములు

బలిజిపేట: మండలంలోని పి.చాకరాపల్లిలో కళ్లాల వద్ద ఉన్న గడ్డివాములు ప్రమాదవశాత్తు దగ్ధమయ్యాయి. ఈ ప్రమాదంలో ఎస్.గోవిందరావు, ఎ.భరతంనాయుడు, ఎ.సరోజనమ్మ, ఎస్.పార్థసారథిలకు చెందిన గడ్డివాములు దగ్ధమైనట్లు గ్రామస్తులు తెలిపారు. సుమారు 20ఎకరాలకు చెందిన గడ్డివాములు దగ్ధం కావడంతో రూ.30వేలు నష్టం వాటిల్లినట్లు తెలిపారు. పశుగ్రాసానికి ఇబ్బందులు పడే పరిస్థితులు ఉన్నాయని బాధిత రైతులు చెబుతున్నారు.

ఘనంగా ఆలయ ప్రతిష్ఠ



చిలకలపల్లిలో జరిగిన ఆలయ ప్రతిష్ఠ

బలిజిపేట: మండలంలోని చిలకలపల్లిలో శ్రీశ్రీశ్రీ చినపోలమ్మతల్లి గ్రామ దేవత ఆలయ పునఃప్రతిష్ఠా కార్యక్రమాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆరవెల్లి శ్రీనివాస శర్మ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు జరిగాయి. రెండు రోజులపాటు నిర్వహించనున్న కార్యక్రమంలో భాగంగా మంగళవారం ప్రతిష్ఠా సంకల్పం, విఘ్నేశ్వర పూజ, భగవత్ పుణ్యాహవచనం, పరిషత్ ప్రాయశ్చిత్తం, పంచగవ్య ప్రాశన, రక్షాసూత్రధారణ, యాగశాల విహరణం, కుండ మంటప సంస్కారం, తదితర కార్యక్రమాలను జరిపించారు. బుధవారం ప్రతిష్ఠా కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ఎ.రవికుమార్, సర్పంచ్ సుందరరావు, టి.ప్రసాదరావు, గ్రామపెద్దలు, రుత్వికులు పాల్గొన్నారు.

వేసవిలో పశుసంరక్షణపై దృష్టి



సమావేశంలో మాట్లాడుతున్న పశువైద్యాధికారి గణేష్

బలిజిపేట: వేసవిలో పశు సంరక్షణపై రైతులు దృష్టి సారించాలని మండల పశువైద్యాధికారి గణేష్ సూచించారు. ఈ మేరకు మండలంలోని తుమరాడలో రైతులతో పశు విజ్ఞాన బడి కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వేసవిలో పశుసంరక్షణ, పశు వ్యాధులపై అవగాహన కల్పించారు. ఎప్పటికప్పుడు పశువుల దాహార్తిని తీర్చాలని, చల్లని ప్రదేశంలో పశువులను ఉంచాలని చెప్పారు. పోషణ సక్రమంగా ఉండాలని సూచించారు. పనులకు తీసుకువెళ్లేటప్పుడు పశువులను అప్రమత్తంగా చూసుకోవాలని హితవు పలికారు. వేసవిలో పశువులకు సోకే వ్యాధులపై అవగాహన కల్పించి ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

దాడిలో ఒకరికి గాయాలు



చికిత్స పొందుతున్న సూరమ్మ

పార్వతీపురం: సీతానగరం మండలం సుమిత్రాపురానికి చెందిన గేదెల సూరమ్మపై అదే గ్రామానికి చెందిన గేదెల చిన్నికృష్ణ పాత కక్షల కారణంగా దుడ్డుకర్రతో దాడి చేశాడు. ఈఘటనలో సూరమ్మ తల, ఎడమ భుజంపై గాయాలయ్యాయి. ఈ మేరకు స్థానికులు 108 వాహనంద్వారా పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి చికిత్సకోసం తీసుకొచ్చారు. పార్వతీపురం ఔట్‌పోస్టు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేటి నుంచి ఓటరు స్లిప్పుల పంపిణీ



మాట్లాడుతున్న తహసీల్దార్ ఎన్వీ రమణ

సీతానగరం: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికను పురస్కరించుకుని ఓటర్లకు బీఎల్వోల ద్వారా ఓటు స్లిప్పుల పంపిణీకి సిద్ధం చేసినట్లు తహసీల్దార్ ఎన్వీ రమణ తెలిపారు. ఈ మేరకు మంగళవారం సాయంత్రం తహసీల్దార్ కార్యాలయానికి ఓటర్ల జాబితాలు చేరిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్చి 13న స్థానిక ఉన్నత పాఠశాలవద్ద ఉన్న పోలింగ్ కేంద్రంలో 1,241 మంది ఓటర్లు వారి ఓటు హక్కు వినియోగించుకోనున్నారని తెలియజేశారు. ఓటర్లకు ఓటు వేయడానికి అవసరమైన స్లిప్‌లను బీఎల్వోలకు పంపిణీ చేస్తామని, ఓటుహక్కు ఉన్న వారు మాత్రమే ఓటుస్లిప్పు తీసుకోవాలని కోరారు.

రాజకీయ పార్టీలతో సమావేశం నేడు

మార్చి 13న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నిక జరగనున్నందున రాజకీయ పార్టీల నాయకులతో బుధవారం అవగాహన సదస్సు నిర్వహించనున్నామని తహసీల్దార్ ఎన్వీ రమణ అన్నారు.

సైన్స్ ఫలాలు అందరికీ అందాలి

- జనవిజ్ఞాన వేదిక జాతీయ నాయకుడు డాక్టర్ ఎంవీఆర్ కృష్ణాజీ
- ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవం

పార్వతీపురంటౌన్: సైన్స్ ఫలాలు సామాన్యులందరికీ అందాలని జనవిజ్ఞాన వేదిక జాతీయ నాయకుడు డాక్టర్ ఎంవీఆర్ కృష్ణాజీ ఆకాంక్షించారు. ఈమేరకు జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా మంగళవారం పట్టణంలోని జీఎస్ఎం కళాశాలలో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్వతీపురం మన్యం జిల్లాలో ప్రతి మారుమూల గిరిజన ప్రాంతానికి సైన్స్ ఫలాలు అందే విధంగా ప్రభుత్వాలు,పాలకులు, అధికారులు కృషి చేయాలని కోరారు. జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు ఆర్.రత్నకుమార్ మాట్లాడుతూ విద్యార్థులు సమాజాన్ని శాస్త్రీయంగా అర్థం చేసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పంచాయతీ రాజ్ డీఈఈ కె.ఎల్ పద్మకళ, డీఏఓ అల్లు ధనలక్ష్మి, జనవిజ్ఞాన వేదిక జిల్లా కార్యదర్శి డి.చంద్రమౌళి, రాష్ట్ర కార్యదర్శి పాలక రంజిత్ కుమార్, కళాశాల నిర్వాహకులు శంకరరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థుల ర్యాలీ

విద్యార్థులందరూ శాస్త్రవేత్తలేనని, నిత్యజీవితం సైన్స్‌తో ముడిపడి ఉందని సైన్స్ ఉపాధ్యాయుడు ఉత్తరావల్లి గోవిందరావు అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో విజ్ఞాన శాస్త్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు అనేక ప్రాజెక్టులను తయారు చేసి ప్రదర్శించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పార్వతీపురం పట్టణ వీధుల్లో భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో సచివాలయ సిబ్బంది, పార్వతీపురం టౌన్ పోలీస్‌స్టేషన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్, సబ్‌ఇన్‌స్పెక్టర్‌లు పాల్గొని విద్యార్థులందరికీ శుభాకాంక్షలు తెలిపారు.



బలిజిపేట: ఉన్నత పాఠశాలలో ప్రదర్శించిన ప్రాజెక్టును ఉపాధ్యాయులకు వివరిస్తున్న విద్యార్థులు



పార్వతీపురం టౌన్: ఆర్టీసీ కాంప్లెక్స్ కూడలి వద్ద విద్యార్థుల ర్యాలీ

మక్కువలో..

మక్కువ: మండలంలోని వెంకటభైరిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం జాతీయసైన్స్ దినోత్సవాన్ని హెచ్‌ఎం పద్మావతి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఏఎంఓ రాజేశ్వరి, ఐఈ కోఆర్డినేటర్ భానుమూర్తి హాజరై, విద్యార్థులు తయారుచేసిన సైన్స్ ప్రయోగాలను పరిశీలించారు. అనంతరం విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఏఎంఓ రాజేశ్వరి మాట్లాడుతూ విద్యార్థి దశనుంచే, సైన్స్ ప్రయోగాలు చేయడం వల్ల మేధాశక్తి పెంపొందుతుందన్నారు. చదువుతోపాటు, కొత్త,కొత్త ప్రయోగాలపై విద్యార్థులు ఆసక్తి కనబర్చాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సైన్స్ ఎగ్జిబిషన్

బలిజిపేట: జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా బలిజిపేట ఉన్నత పాఠశాలలో ప్రదర్శించిన సైన్స్ ఎగ్జిబిషన్ ఆకట్టుకుంది. ఎగ్జిబిషన్‌లో 25 సైన్స్ ప్రాజెక్టులను విద్యార్థులు ఏర్పాటుచేశారు. మొక్కలు నాటండి–భూమిని కాపాడండి, కాంతి వనరు, క్లాప్ స్విచ్, జలచక్రం, మురుగునీరు శుభ్రం చేయు విధానం వంటి ప్రాజెక్టులను విద్యార్థులు ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



మక్కువ: విద్యార్థులకు బహుమతి ప్రదానం చేస్తున్న ఏఎంఓ రాజేశ్వరి



సీతానగరం: విజేతలకుఅందజేసిన ప్రశంసాపత్రాలతో ఎంఈఓ జి సూరిదేముడు



సాలూరు: మామిడిపల్లిలో విద్యార్థులు ప్రదర్శిస్తున్న సైన్స్ ప్రాజెక్టులు



పార్వతీపురం టౌన్: సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ ఎంవీఆర్ కృష్ణాజీ

సాలూరులో..

సాలూరు: పట్టణం, మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మామిడిపల్లి, పెదబోరబంద జెడ్పీహెచ్ పాఠశాలల్లో విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వం, చిత్రలేఖనం, సైన్స్ ప్రాజెక్టులపై పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. పట్టణంలోని దీప్తి, రవీంద్రభారతి తదితర పాఠశాలల్లో ప్రదర్శించిన సైన్స్ ప్రాజెక్టులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

సీతానగరంలో..

సీతానగరం: విద్యార్థుల్లో దాగిఉన్న విజ్ఞానాన్ని వెలికితీయడానికి సైన్స్ దినోత్సవం దోహద పడుతుందని ఎంఈఓ జి సూరిదేముడు అన్నారు. సీతానగరం, నిడగల్లు,ఆర్ వెంకంపేట, బూర్జ జెడ్పీఉన్నత పాఠశాలల్లో, స్థానిక హోలీ క్రాస్ పరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా సైన్స్ ప్రాజెక్టుల ప్రదర్శన జరిగింది. ఈ మేరకు హోలీ క్రాస్ ఉన్నత పాఠశాలలో జరిగిన విజ్ఞాన సదస్సులో ఎంఈఓ జి.సూరిదేముడు పాల్గొని మాట్లాడుతూ శాస్త్ర సాంకేతిక రంగాల్లో తమ ప్రతిభను చూపడానికి విద్యార్థులకు ఇదో చక్కని అవకాశం అన్నారు. పోటీల్లో పాల్గొన్న విజేతలకు పాఠశాల యాజమాన్యం బహుమతులను అందజేసింది.

పాచిపెంటలో..



పాచిపెంట: విద్యార్థులు ఏర్పాటు చేసిన వైజ్ఞానిక ప్రదర్శన

పాచిపెంట: జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలో మెదటిగా సర్ సీవీరామన్ చిత్రపటానికి ప్రధానోపాధ్యాయుడు ఆర్.పెంటయ్య ఉపాధ్యాయులు పూలమాల వేసి నివాళులర్పించారు. సైన్స్ విశిష్టతను విద్యార్థులకు తెలియజేశారు. విద్యార్థులు ఏర్పాటు చేసిన వైజ్ఞానిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో సైన్స్ ఉపాధ్యాయులు ఎస్.సన్యాసిరావు, ఎ.లక్ష్మణ. ఎస్.హైమావతి ఎ.సాంబమూర్తి తదితరులు పాల్గొన్నారు.

దర్జీ వృత్తి ద్వారా స్వయం ఉపాధి

- టైలర్స్ డే శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే

పార్వతీపురం టౌన్: దర్జీ వృత్తి ద్వారా స్వయం ఉపాధి పొందవచ్చని ఎమ్మెల్యే జోగారావు అన్నారు. ప్రపంచ దర్జీల దినోత్సవం సందర్భంగా స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో కేక్ కట్ చేసి దర్జీ వృత్తి చేస్తున్న వారందరికీ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిబ్రవరి 28న ప్రపంచవ్యాప్తంగా దర్జీల దినోత్సవాన్ని ఘనంగా జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోందన్నారు. దర్జీ వృత్తి ద్వారా స్వయం ఉపాధి పొందుతున్న మహిళలందరికీ రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తోందని ప్రతి ఒక్కరికీ జగనన్న చేదోడు పథకం ద్వారా రూ.10 వేల ఆర్థిక సాయం గత 3 ఏళ్లుగా అందిస్తోందని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు కొండపల్లి బాలకృష్ణ, ఏఎంసీ వైస్‌చైర్మన్ వి.శంకర్రావు, స్టేట్ డైరెక్టర్లు శ్రీదేవి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, మహిళలు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే జోగారావు

సీతంరాజు సుధాకర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలి

సీతానగరం: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ బలపర్చిన సీతంరాజు సుధాకర్‌కు మొదటి ప్రాధాన్యం ఓటు వేసి అధిక మెజార్టీతో విజయం సాధించడానికి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, సానుభూతి పరులు కృషి చేయాలని ఎమ్మెల్యే అలజంగి జోగారావు కోరారు. ఈ మేరకు మంగళవారం వైఎస్సార్‌సీపీ మండల కార్యాలయంలో పార్టీ మండల అధ్యక్షుడు బి.చిట్టిరాజు అధ్యక్షతన స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు,పార్టీ నాయకులు,కార్యకర్తలతో ఎమ్మెల్సీఎన్నికల సమాయత్త సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్చి 13న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు జరుగనున్నాయన్నారు. ఎన్నికలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఆశీస్సులతో సీతంరాజు సుధాకర్ పోటీలో ఉన్నారని తెలియజేశారు. మండలంలోని పట్టభద్రులైన ఓటర్లతో మొదటి ప్రాధాన్యత ఓటును సీతంరాజు సుధాకర్‌కు వేయించడానికి గ్రామాల్లో ఓటర్లను అర్థించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ ప్రతినిధి బి.శ్రీరాములు, జెడ్పీటీసీ ఎం బాబ్జీ, వైస్‌ఎంపీపీ టి.సూర్యనారాయణ, వ్యవసాయ సలహామండలి జిల్లా చైర్మన్ వి.నాగేశ్వరరావు, మాజీ జెడ్పీటీసీ టి.వెంకటప్పలనాయుడు, డీసీసీబీ డైరెక్టర్ ఎ. కృష్ణంనాయుడు, మాజీ ఎంపీపీ కె రత్నాకర్, పలుగ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

రథసారథుల్లా పనిచేయాలి

పార్వతీపురంటౌన్: ప్రభుత్వ పాలన మరింతగా ప్రజలకు చేరువ చేయడమే లక్ష్యంగా గృహ సారథులు రథసారథుల్లా పని చేయాలని ఎమ్మెల్యే అలజంగి జోగారావు పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం పట్టణంలోని బెలగాం ప్రాంతంలో లూథరన్ చర్చి ప్రాంగణంలో 8–9 సచివాలయాలకు చెందిన 15,16,17,18 వార్డుల సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, కార్యకర్తలతో నిర్వహించిన గృహ సారథుల పరిచయ వేదిక కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ పురపాలక సంఘంలో వైఎస్సార్‌సీపీని మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా చేసుకుని రానున్న 2024 సాధారణ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఘనవిజయం సాధించడమే ప్రధాన కర్తవ్యంగా సీఎం వైఎస్ జగన్‌ను మళ్లీ సీఎంగా గెలిపించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్క కార్యకర్త, నాయకుడిపై ఉందని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు కొండపల్లి బాలకృష్ణ, పార్టీ మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ మంత్రి రవికుమార్, పట్టణ జేసీఎస్ కన్వీనర్ గొర్లి మాధవరావు, ఏఎంసీ వైస్‌చైర్మన్ వానపల్లి శంకరరావు, కౌన్సిలర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మస్తరులో చేతివాటం ప్రదర్శిస్తే చర్యలు

సీతానగరం: ఉపాధి హామీ పనుల్లో పాల్గొనే వేతనదారులకు వేతనం గిట్టు బాటయ్యేలా క్షేత్ర సహాయకులు పనికల్పించాలని ఎంపీడీఓ బి.కృష్ణ మహేష్ రెడ్డి అన్నారు. ఈ మేరకు మంగళవారం గెడ్డలుప్పి, కొత్తవలస,బగ్గందొరవలస గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనులను పరిశీలించి వేతనదారుల మొబైల్‌తో ఆన్‌లైన్ మస్తరు వేసేవిధానాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యయ ప్రయాసల కోర్చి ఉపాధి పనుల్లో పాల్గొనే వారికి వేతనం గిట్టుబాటయ్యే విధంగా టెక్నికల్, అసిస్టెంట్, క్షేత్ర సహాయకులు నిర్దేశించిన కొలతలు ఇవ్వాలని సూచించారు.

ఉపాధి పనులకు డుమ్మాకొట్టిన వారికి మస్తరు వేయడం వల్ల పనుల్లో పాల్గొనే వారికి వేతనం గిట్టుబాటు కాదన్నారు. క్షేత్ర సహాయకులు ఎవరికీ తలవంచకుండా మస్తరు వేయాలని లేనిపక్షంలో శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఉపాధి వేతనదారుల మస్తరు వేయడంలో క్షేత్ర సహాయకులు చేతివాటం ప్రదర్శిస్తున్నారని, వేతనదారులకు గిట్టుబాటు కాకపోవడానికి అది ఒక కారణమన్నారు. ఇప్పటికైనా వేతనదారులకు క్షేత్ర సహాయకులు నిర్భయంగా మస్తరు సకాలంలో వేయాలని సూచించారు. కార్యక్రమంలో టీఏలు, క్షేత్ర సహాయకులు,శ్రమశక్తి సంఘసభ్యులు పాల్గొన్నారు.



మస్తరు రికార్డును పరిశీలించి వేతనదారులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ కృష్ణమహేష్‌రెడ్డి

ఆధార్ అప్‌డేషన్ తప్పనిసరి

బలిజిపేట: ఆధార్ అప్‌డేషన్ తప్పనిసరి అని ఎంపీడీఓ భానుమూర్తి తెలిపారు. మండలంలోని అరసాడ, వంతరాంలలో ఆధార్ అప్‌డేషన్‌పై రెండు రోజుల ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. 10సంవత్సరాల క్రితం ఆధార్ చేయించుకున్న వారు భవిష్యత్‌లో సంక్షేమ పథకాల అమలుకు ఆధార్ అప్‌డేషన్ చేయించుకోవాలని ఈ సందర్భంగా ఎంపీడీఓ కోరారు. కేంద్ర ప్రభుత్వం కొత్తగా తీసుకువచ్చిన నిబంధన ప్రకారం అన్ని వయస్సుల వారు వారి ఆధార్‌ను అప్‌డేట్ చేసుకోవాల్సి ఉందన్నారు. అందుకు ప్రభుత్వం ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తోందని చెప్పారు. ఆయా గ్రామాలలో కేంద్రాలను ఏర్పాటు చేసినప్పుడు ప్రజలు తప్పనిసరిగా వాటిని వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.



అరసాడలో ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్న సిబ్బంది

ఎమ్మెల్యే ఇంటింటి ప్రచారం



ఇంటింటి ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే జోగారావు

పార్వతీపురంటౌన్: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఎమ్మెల్యే జోగారావు కోరారు. ఈ మేరకు ఎన్నికల ప్రచార కార్యక్రమంలో భాగంగా మంగళవారం పార్వతీపురం పురపాలక సంఘం పరిధి బెలగాం ప్రాంతం 22, 23వ వార్డు శిరికి వీధి, సాంఖా వీధి, కోడిగుడ్ల వీధి, దేవీనగర్‌లలో స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి పట్టభద్రులు ఉన్న ప్రతి ఇంటికీ వెళ్లి ఓటర్లను కలిసి ప్రచార కరపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు కొండపల్లి బాలకృష్ణ, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ మంత్రి రవికుమార్, జేసీఎస్ కన్వీనర్ గొర్లి మాధవరావు, కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సీతంరాజు సుధాకర్‌కు మద్దతుగా గ్రామాల్లో ప్రచారం

సీతానగరం: ఉత్తరాంధ్ర పట్టభద్రుల వైఎస్ఆర్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌కు మద్దతుగా మండలంలోని గ్రామాల్లో కమిటీ సభ్యులు ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యుడు సూర్యనారాయణ మాట్లాడుతూ ఉత్తరాంధ్ర పట్టభద్రులైన ఓటర్లు మొదటి ప్రాధాన్యత ఓటును సీతంరాజు సుధాకర్‌కు వేసి గెలిపించాలని కోరారు.



బ్యాలెట్ పత్రంతో ఓటర్లను అర్థిస్తున్న మండల కమిటీ సభ్యుడు సూర్యనారాయణ

వైఎస్సార్ సీపీ అభ్యర్థిని గెలిపించండి

బలిజిపేట: వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌ను గెలిపించాలని జెడ్పీటీసీ రవికుమార్ కోరారు. ఈ మేరకు బలిజిపేటలో మంగళవారం ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. తమ అభ్యర్థికి మొదటి ప్రాధాన్యత ఓటువేయాలని, ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమాన్ని చూసి పార్టీ అభ్యర్థిని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు వి.సాయిరాం, పార్టీ నాయకులు జగన్, బి.జ్యోతీష్, అప్పారావు, డి.సత్యనారాయణ, తిరుపతి పాల్గొన్నారు.



బలిజిపేటలో ప్రచారం చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

పూరిల్లు దగ్ధం



దగ్ధమైన పూరిల్లు

సాలూరు: పట్టణంలోని తట్టికోటవీధిలో ఓ పూరిల్లు మంగళవారం దగ్ధమైంది. ఈ మేరకు అగ్నిమాపక అధికారి పైడిరాజు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. తట్టికోటవీధికి చెందిన కిక్కర ఈశ్వరరావుకు ఇల్లు విద్యుత్‌షార్ట్‌సర్క్యూట్ కారణంగా దగ్ధమవుతున్నట్లు సమాచారం అందగానే అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి వెళ్లి మంటలను అదుపుచేశారు. ఈ ప్రమాదంలో గృహోపకరణాలు, పత్రాలు,కొంత నగదు కాలిపోయాయి.

ప్రతి గ్రామంలో 15రోజులకోసారి వైద్యసేవలు

- పీహెచ్‌సీ వైద్యాధికారి శ్రీకాంత్

పార్వతీపురంటౌన్: ఫ్యామిలీ డాక్టర్ విధానంలో భాగంగా ప్రతి గ్రామంలో 15రోజులకొకసారి వైద్య సేవలు అందిసస్తున్నట్లు వెద్యాధికారి శ్రీకాంత్ తెలిపారు. మండలంలోని జమ్మిడివలస గ్రామంలో మంగళవారం వైద్యశిబిరం నిర్వహించారు. ఈ మేరకు అవసరమైన వారికి వైద్యపరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో నిర్వహించే వైద్యశిబిరాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గ్రామాల్లో నిర్వహించే వైద్యశిబిరంలో 8రకాల వైద్య పరీక్షలను నిర్వహిస్తున్నామని, 66 రకాల మందులు అందుబాటులోఉన్నాయని, రోగికి అవసరమైన మేరకు మందులను అందజేస్తున్నామన్నారు. గ్రామాల్లో మంచానపడి ఉన్న రోగుల వద్దకు వెళ్లి వారి ఇళ్లవద్దనే వైద్యసేవలు అందిస్తున్నామని చెప్పారు. గ్రామాల్లో నిర్వహిస్తున్న ఫ్యామిలీ డాక్టర్ విధానానికి మంచి స్పందన లభిస్తోందన్నారు కార్యక్రమంలో ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు, సీహెచ్‌ఓలు, 104 సిబ్బంది, డేటా ఎంట్రీ ఆపరేటర్‌లు పాల్గొన్నారు.



జమ్మిడివలసలో వైద్యరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ శ్రీకాంత్

మార్చి 2న సోషల్ ఆడిట్‌పై సమీక్ష

గుమ్మలక్ష్మీపురం: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధి హామీ పథకం పనులకు సంబంధించి, జరిగిన సోషల్ ఆడిట్‌పై మార్చి 2వ తేదీన సమీక్ష నిర్వహిస్తున్నట్లు ఏపీఓ డి.శివరామకృష్ణ ఓ ప్రకటనలో మంగళవారం వెల్లడించారు.